గురు వారం
07-12-2023
సంపుటి - 08,
సంచిక - 405
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# ముఖ్యమంత్రిగా నేడు రేవంత్ రెడ్డి ప్రమాణం

## అమరుల కుటుంబాలకు ప్రత్యేక పిలుపు

- మధ్యాహ్నం 1.04 నిమిషాలకు ప్రమాణ కార్యక్రమం
- ప్రమాణస్వీకారం అనంతరం ఆరు గ్యారెంటీలపై సంతకం
- ఎల్బీ స్టేడియంలో ప్రమాణానికి భారీగా ఏర్పాట్లు
- కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు, పలువురు సిఎంలకు ఆహ్వానాలు
- మాజీ సిఎం చంద్రబాబు నాయుడకు కూడా ఆహ్వానం
- కోదండరామ్ సహా మేధావులకు ఆహ్వానాలు



**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** తెలంగాణ కొత్త ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణం చేయనున్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా ఆయన మధ్యాహ్నం ఒంటిగంటా నాలుగు నిముషాలకు ప్రమాణం చేయనున్నారు. గవర్నర్ తమిళ్‌సై ఆయనతో ప్రమణాం చేయిస్తారు. ఈ మేరకు ఎల్బీ స్టేడియంలో భారీగా ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను సిఎస్ శాంతికుమారి, పోలీస్ అధికారులు పరిశీలించారు. రేవంత్ పేరును కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసిన దరిమిలా దివంతగ వైఎస్ సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ..ఎల్బీ స్టేడియంలో ప్రమాణం చేయబోతున్నారు. అలాగే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై తొలి సంతకం చేయబోతున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో మలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేయబోతున్నారు. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేసారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ,ప్రియాంక గాంధీ, సోనియా తదితరులను కలిసి ప్రమాణస్వీకారానికి ఆహ్వానించారు. సోమవారం జరిగిన సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం రేవంత్‌ను సీఎల్పీ నేతగా ఎంపిక చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ దిల్లీలో ప్రకటించారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని జోరుగా ప్రచారం జరిగినప్పటికీ, కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో కొంత

3వ పేజీలో...

# ఎల్బీ స్టేడియంలో సిఎం ప్రమాణ స్వీకారోత్సవం

## ఏర్పాట్లపై సిఎస్ శాంతికుమారి ఉన్నతస్థాయి సమీక్ష



ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలకు ఆదేశం

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** ఎల్‌బీస్టేడియంలో గురువారం సిఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, మంత్రి మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ సచివాలయంలో సమావేశం నిర్వహించి సమీక్షించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సి.ఎస్ కోరారు. ప్రమాణస్వీకారానికి వచ్చే వారికి తగిన బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, అగ్నిమాపక శకటాలను వేదిక వద్ద ఉంచాలి. వేదికను శుభ్రపరచడం, త్రాగు నీరు ఫాగింగ్ చేయడం వంటివి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఎల్బీ స్టేడియం వద్దకు వెళ్లే రహదారుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అన్ని సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. అదేవిధంగా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, ప్రిన్సిపల్ సెక్రటరీలు ఓ రిజ్వీ, శైలజా రామయ్యర్, గవర్నర్ సెక్రటరీ సురేంద్ర మోహన్, సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ శ్రీనివాస్ రాజు, కమిషనర్ అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. తరవాత ఏర్పాట్లపై సీ.ఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో

3వ పేజీలో...

### భారత సంస్కృతిని కాంగ్రెస్ అవమానిస్తుంది

# అనురాగ్ థాకూర్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** ఉత్తరాది-దక్షిణాది రాష్ట్రాల మధ్య విపక్షాలు చిచ్చు పెడుతున్నాయని, భారతీయ సంస్కృతి, అస్థిత్వాన్ని అవమానించేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నినట్లు కేంద్ర మంత్రి అనురాగ్ థాకూర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఓటమి గురించి విశ్లేషణ చేయకుండా.. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తుందని మంత్రి అనురాగ్ అన్నారు. ఇవాళ మీడియాతో మాట్లాడుతూ మంత్రి అనురాగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది గురించి అభ్యంతరకర కామెంట్లు చేస్తున్నారని, సనాతన ధర్మాన్ని కూడా కించపరిచారని, అలాంటి ఘటనల పట్ల సీనియర్ కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్

3వ పేజీలో...

# ఈ ఫలితాలు స్పీడ్ బ్రేకర్ మాత్రమే

## ప్రజలు పార్టీని, కెసిఆర్‌ను వదులుకోరు: కెటిఆర్



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 6 (సమ సమాజం):** తెలంగాణకు ఉన్న ఏకైక గొంతు కేసీఆర్, బీఆర్ఎస్.. ఆ రెండింటిని ప్రజలు వదులుకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇది తాత్కాలిక స్పీడ్ బ్రేకర్ మాత్రమే.. ఇది స్వల్ప కాలం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కేటీఆర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో అనుకోని ఫలితాలు రావడం సహజం.. నిరాశ పడాల్సిన అవసరం లేదన్నారు. తమ పార్టీ పుట్టిందే పోరాటాల నుంచి, పోరాటాలు తమకేం కొత్త కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన మాట్లాడుతాం అని చెప్పారు. పవర్ పాలిటిక్స్‌లో అధికారం రావడం పోవడం సహజం. ప్రజలు మనకు కూడా రెండు సార్లు అవకాశం ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రలో కూడా రాణిస్తాం. సిరిసిల్లలో ఓటుకు డబ్బులు, మందు పంచనని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాను అని కేటీఆర్ తెలిపారు.

# పివోకే ఎప్పటికీ మనదే

నెహ్రూ తప్పిదాల వల్లనే కోల్పోయాం

లోక్‌సభలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** గత పాలకులు చేసిన తప్పిదం కారణంగా పాక్ అక్మిత కాశ్మీర్ భారత్‌లో బగం కాలేక పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ పీఓకే పై సంచలన ప్రకటన చేశారు. అది భారతదేశానికి

3వ పేజీలో...

# తొలి హామీని నిలబెట్టుకుంటున్న రేవంత్

## దివ్యాంగురాలికి తొలి ఉద్యోగం

## ఎల్బీ స్టేడియంలోకి రావాలని ఆహ్వానం



**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** తెలంగాణలో తొలి ఉద్యోగం నాకే రాబోతున్నందుకు సంతోషంగా ఉంది. రేవంత్ రెడ్డి సార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయబోతున్నారు. గాంధీ భవన్ వెళ్లినప్పుడు ఆయన నాకు ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ ఆయన నెరవేరుస్తుండడం హ్యాపీగా ఉందని దివ్యాంగురాలు రజిని ఆనందం వ్యక్తం చేశారు. అధికారంలోకి గనుక వస్తే.. అంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో సర్కార్ ఏర్పాటు అవుతున్న తరుణంలో వాటిని నెరవేర్చేందుకు సిద్ధమై

3వ పేజీలో...

# భారత రాజ్యాంగం ఎంతో గొప్పది : తమిళిసై

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం) :** ప్రపంచంలోనే భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని తెలుగు తల్లి విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. మహిళల అభివృద్ధే నిజమైన అభివృద్ధి అన్న అంబేద్కర్ మాటలను గుర్తు చేశారు.



## అసెంబ్లీలో గెలిపిన ఎంపిలు లోక్‌సభకు రాజీనామాలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు లోక్‌సభ, రాజ్యసభ సభ్యత్వాలను వదులుకున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ ఎంపీలు, పలువురు కేంద్ర మంత్రులు బుధవారం తమ లోక్‌సభ స్థానాలకు రాజీనామా చేశారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఈ నేతలు పార్లమెంట్‌లోని స్పీకర్ కార్యాలయంలో తమ రాజీనామాలను సమర్పించారు. అసెంబ్లీ

3వ పేజీలో...

# ప్రజాస్వామ్య పునరుద్ధరణెళి తొలి విజయం !

తెలంగాణలో ఇప్పుడు ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకు తగ్గట్లుగానే మన కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రజాస్వామ్య పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేయడం ద్వారా..చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడం ద్వారా ఈ ప్రభుత్వం ముందు తన సచ్చీలతను చాటుకోవాలి. ఈనెల 7న సిఎంగా ప్రమాణం చేయబోతున్న రేవంత్ రెడ్డి, మంత్రులుగా ప్రమాణం చేయబోతున్న వారు ముందుగా గ్రామస్థాయిలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చూపగలగాలి. ప్రజలు తాము కోరుకున్న పని చిన్నదే అయినా అది కాకపోతే దానిని పెద్దగా చూస్తారు. దానిని పదిమందికి చెప్పి పెద్దది చేస్తారు. గత పదేళ్లలో అవినీతి బాగా పెరిగింది. గ్రామపంచాయితీ మొదలు అన్ని కార్యాలయాల్లో అవినీతి బాగా వేళ్లానుకుంది. కాంగ్రెస్ మంత్రులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. వ్యవస్థను బాగు పర్చాలి. గతంలో కెసిఆర్ అనే నియంత..ఆయన కింద ఉన్న ఛోటా నియంతలైన మంత్రులు, ఎమ్మెల్యేలు అడ్డగోలు సంపాదనలతో ప్రజలను పట్టించుకోలేదు. పోలీసులను గుప్పిట్లో పెట్టుకుని కేసులతో బెదరించారు. తమకు వ్యతిరేకులు అనుకున్న వారిని కేసులతో కోర్టుల చుట్టు తిప్పారు. అందులో మన కాబోయే సిఎం రేవంత్ తదితరులు కూడా బాధితులే. ఇప్పుడా సమస్యలు రాకుండా క్షేత్రస్తాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. గ్రామపంచాయితీ స్థాయిలో చేయి తడపనిదే పని చేయడం లేదు. ఇది అవినీతికి పరాకాష్టగా నిలిచింది. ఈ విషయాలను గతంలో పత్రికల్లో ప్రచారం చేసినా నాటి నియంతలు పట్టించు కోలేదు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి వల్లనే కాంగ్రెస్ విజయం సాధించింది. నియంతలకు స్థానం లేదని ప్రజలు నిరూపించారు. ఈ అవకాశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగించుకోవాలి. ప్రజలకు మెరుగైన పాలన అందించేలా చేయాలి. గతంలో కన్నా ఇప్పుడు ప్రజలు ప్రతి విషయాన్ని భూతద్దంలో పెట్టి చూస్తారు. ఎందుకంటే ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. వాటిని మెల్లగా అమలు చేసుకుంటూ పోవాలి. రాజకీయాల్లో పోరాటాలు సహజం. ప్రత్యర్థి పార్టీలను మట్టుపెట్టడం అన్నది ప్రజా స్వామ్యంలో కొత్తేమీ కాదు. కాంగ్రెస్‌ను మట్టి కరిపించిన మోడీ కూడా భారత్ ముక్త కాంగ్రెస్ నినాదంతో ముందుకు సాగుతున్నారు. అయినా కాంగ్రెస్‌ను పూర్తిగా తుడిచిపెట్టలేక పోయారు. తెలంగాణలో బిఆర్ఎస్‌తో అంటకాగి నానాగడ్డి కరిచినందుకు ఆ పార్టీని దెబ్బకొట్టారు. రాజకీయ పార్టీలను చావుదెబ్బ కొట్టడమే లక్ష్యంగా రాజకీయ వ్యూహాలు సాగుతుంటాయి. వాటికి ప్రజల ఆమోదం దక్కితే విజయం సాధిస్తారు. తెలంగాణలో రేవంత్ వ్యూహాలకు ప్రజలు కూడా మద్దతుగా నిలిచారు. కెసిఆర్ అనే అహంభావి ని తరిమికొట్టారు. రేవంత్ ఈ విషయం గుర్తించి తెలివిగా మసలుకుంటే కెసిఆర్ మళ్లీ ఎదగడానికి అవకాశం ఉండదు. అందుకు పాలనాపరమైన శ్రద్ధ తీసుకోవాలి. అవినీతిని దూరంగా పెట్టాలి. టిడిపి నుంచి కాంగ్రెస్ లో చేరిన నాటినుంచే రేవంత్ రెడ్డి కెసిఆర్ కుటుంబ పాలనను అంతమొందిస్తామని ప్రతినబూనారు. అందుకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని వేదికగా చేసుకుని పోరాటం చేశారు. కెసిఆర్ సాగిస్తున్న వ్యక్తి పాలనను, కుటుంబ పాలనను అంగీకరించడానికి ఇది రాచరిక వ్యవస్థ కాదని ప్రజలు ఇచ్చిన తీర్పుతో రేవంత్ నిరూపించగలిగారు. అలాగని ఎవరైనా ఏకవ్యక్తి పాలన సాగిస్తే అంగీకరించే రోజులు పోయాయి. మధ్య ప్రాచ్య దేశాల్లో కూడా ఏకవ్యక్తి పాలన సాగుతున్న దేశాల్లో దాడులు జరిగాయి. నియంతృత్వ పాలనపై తిరుగబాట్లు జరిగాయి. సద్దాంహుస్సేన్, కల్నల్ గడాఫీ లాంటి వారే మట్టి కరిచారు. ఇంకా చెప్పాలంటే పాక్ సైనిక నియంత పర్వేజ్ ముషారప్ కూడా ప్రజల తిరుగుబాటులో తోకముడిచారు.

మనదేశంలో ఇందిర నియంతృత్వంపైనా ప్రజలు తిరుగుబాటు చేశారు. బెంగాల్లో వామపక్ష కూటమిని కూకటి వేల్లతో మమతా బెనర్జీ కూల్చి వేశారు. అక్కడ నియంత లేకున్నా నియంతృత్వ పాలన సాగడం కారణంగానే ప్రజలు తిరస్కరించారు. ప్రజలు ఎప్పటికప్పుడు చైతన్యం అవుతూ వస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదరించిన ఎన్టీఆర్‌ను కూడా ప్రజలు తమ ఓటుతో తిరస్కరించారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ పదేళ్ల పాలనపై ప్రజలు తిరుగుబాటు చేసి మోడీకి పట్టం కట్టారు. అయితే మోడీ కూడా సీనియర్లను పక్కన పెట్టి పార్టీలో ఏకవ్యక్తి పాలన సాగిస్తున్నారు. ఉమ్మడి నిర్ణయాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారు. దేశంలో ప్రజలు ఎప్పటికప్పుడు పాలకుల నిర్ణయాలపై సమీక్షించుకుంటారు. పాలకుల తప్పిదాలను లెక్కలు వేస్తుంటారు. మోడీ ఏకపక్ష నిర్ణయాలను ప్రజలు గమనించడం లేదని అనుకోవడానికి లేదు. కాంగ్రెస్ చేసిన పాపాల కారణంగానే ప్రజలు దానిని దూరంగా ఉంచారు. అలాగని మళ్లీ ఆదరించరని లేదు. అందుకు తెలంగాణెళి ఉదాహరణ. ఇక్కడ కేవలం కెసిఆర్ అహంకారంపై మాత్రమే ప్రజలు తిరుగుబాటు చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కెసిఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్‌కు పట్టం కట్టారు. తెలంగాణ ఏర్పడ్డ సమయంలో, అంతకు ముందూ ప్రజల్లో అనేకానేక ఆకాంక్షలు ఉన్నాయి. అవన్నీ సిఎంగా కెసిఆర్ నెరవేర్చడం పక్న పెడితే..ప్రజలకు దూరంగా, కుటంబాబానికి దగ్గరగా పాలన సాగించారు. నయా నియంతగా అవతరించారు. తెలంగాణ పోరాట యోధులు, అమరవీరుల ఆకాంక్షలు నెరవేర్చలేక పోయారు. అలాగే తెలంగాణ వచ్చాక ఏ వర్గానికి న్యాయం జరగలేదని.. నిష్ఠుర సత్యం. అందువల్ల అధికారం చేపట్టబోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ గత విధానాలను సమీక్షించుకుని ప్రజారంజక పాలనను సాగించాలి. ప్రజల మనసెరిగిన నేత అయితే వాటిని జాగ్రత్తగా గమనించి సరిదిద్దుకుని ముందుకు సాగుతారు. రేవంత్ రెడ్డి ప్రజల నుంచి వచ్చిన సాదాసీదా మనిషి కనుక ఇవన్నీ ఆకళింపు చేసుకుని పోతాడని ఆశిద్దాం. తన నేతృత్వంతో ఓ మంచి పాలనను అందించే ప్రయత్నం చేయాలని కోరుకుందాం.

# తుఫాన్ సహాయక చర్యలు ముమ్మరం



•తక్షణ సాయం అందించేలా కార్యక్రమాలు•ప్రజల్లో ఎలాంటి నిరసనలు లేకుండా చూడాలి•కలెక్టర్లు బాగా పనిచేశారన్న పేరు రావాలి
•జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం జగన్ సమీక్ష

అమరావతి,డిసెంబర్6(సమ సమాజం): తుపాను ప్రభావం, చేపడుతున్న సహాయచర్యలపై సీఎం జగన్ మరోమారు ఆరా తీసారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందును సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ఇప్పటికే చేపట్టిన సహాయక చర్యలపై అధికారులు వివరాలు అందించారు. .ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ..వర్షాల నుంచి తెరిపి వచ్చింది. ప్రస్తుతం తుపాను బలహీనపడి అల్పపీడనంగా మారింది. తుపాను వల్ల వర్షాలు విస్తృతంగా పడ్డాయి. కలెక్టర్లు, సీనియర్ ఐఏఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా క్షేత్రస్థాయిలో మంచిగా పనిచేశారు. అధికారులంతా మీ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను తీసుకురావడంపై దృష్టిపెట్టాలన్నారు. చిన్న చిన్న విషయాల మీద ధ్యాస మిస్ కాకుండా చూసుకోవాలి. బాధితులపట్ల సానుభూతితో వ్యవహరించండి. బాధితుల స్థానంలో మనం ఉంటే ఎలాంటి సహాయాన్ని ఆశిస్తామో.. ఆ తరహా సాయం వారికి అందాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. రూ.10 ఎక్కువ ఖర్చు అయినా.. బాధితులకు మంచి సహాయం అందాలి. ఆ దిశగా పనిచేయాలి. ప్రతి ఒక్కరి నోటా.. ఇంత కష్టంలో కూడా మా కలెక్టర్ బాగా చేశాడన్న మాట వినిపించేలా చేయాలన్నారు. వారి పట్ల ఉదారంగా వ్యవహరించాలి. పరిహారం అందించడంలో సానుభూతితో ఉండండి.సాయంలో లోటు రాకూడదు... వర్షాల వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10వేలు ఇచ్చే విషయంలోనూ, వర్షాలు కారణంగా ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల వారిని క్యాంపులకు తీసుకొచ్చి వారిని చూసుకునే విషయంలోనూ, క్యాంపుల నుంచి తిరిగి ఇళ్లకు వెళ్లున్న సందర్భంలోనూ వారికి ఇవ్వాల్సిన సహాయం వారికి ఇవ్వాలి. రేషన్ పంపిణీలో కూడా ఎలాంటి లోపం ఉండకూడదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. పొలాల్లో నీటి తొలిగింపు అత్యంత ప్రాధాన్యాంశం. పంటపొలాల్లో ఉన్న వరదనీటిని పూర్తిగా తొలగించడంపై దృష్టి పెట్టాలి. అన్ని రకాల మానవ వనరులను దీనిపై పెట్టండి. ధ్యాసంతా ఇక్కడే పెట్టాలి. ఇది అత్యంత ప్రాధాన్య అంశం. పంటల సంరక్షణకు ప్రతి ఆర్బీకే పరిధిలోనూ ఎస్ఓపీ ఇప్పటికే జారీ చేశారు. ప్రతి అడుగులోనూ రైతుకు అండగా...రైతులకు కచ్చితమైన భరోసా ఇవ్వండి. ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా నిలబడుతుంది. వారు అధైర్య పడాల్సిన పనిలేదు. పంటల రక్షణ, పంటలకు పరిహారం అందించడం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుంచి అన్ని రకాలుగా రైతుకు ప్రతి అడుగులోనూ తోడుగా ప్రభుత్వం ఉంటుంది. 80శాతం సబ్సిడీపై విత్తనాల సరఫరాకూ అన్ని రకాలుగా సిద్ధం కావాలి. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు...యుద్ధ ప్రాతిపదికన అత్యధిక ప్రాధాన్యతతో విద్యుత్‌ను పునరుద్ధరించాలి. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రవాణా పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకొండి. వీటిని కూడా ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమంగా తీసుకొండి. వర్షాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై కూడా దృష్టి పెట్టండి. అధికారులంతా బాగానే పనిచేస్తున్నారు. మేమందరం మీకు తోడుగా ఉన్నాం. ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉన్నాం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొండి. దురదృష్టవశాత్తూ విధి నిర్వహణలో ఉండగా చెట్టుకూలి కానిస్టేబుల్ చనిపోయాడు. ఆ కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఆదుకుంటుంది. ఆ కుటుంబానికి రూ.30 లక్షలు సాయం అందిస్తాం. విధినిర్వహణలో ఉన్న ఉద్యోగుల స్థైర్యం నిలబడేలా ప్రభుత్వం తోడుగా నిలుస్తుంది.ఉద్యోగుల స్థైర్యం నిలబడేలా...గ్రామాల్లో ఉన్న వాలంటీర్ దగ్గర నుంచి, సచివాలయ సిబ్బంది మొదలుకుని, ప్రభుత్వంలో పై స్థాయిలో ఉన్న ఉద్యోగి వరకు ఎలాంటి ఇబ్బంది జరిగినా.. ప్రభుత్వం అన్ని రకాలుగా తోడుగా ఉంటుంది. వారిలో ఆత్మస్థైర్యాన్ని నిలబెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని సీఎం జగన్ స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి జరిగిన కాన్ఫరెన్సులో హోం,విపత్తు నిర్వహణశాఖ మంత్రి తానేటి వనిత, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కే వీ రాజేంద్రనాథ్ రెడ్డి, రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ స్పెషల్ సీఎస్ జి సాయి ప్రసాద్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె విజయానంద్, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం టీ కృష్ణబాబు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్ అరుణ్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఏ.సూర్యకుమారి, ఏపీ స్టేట్ సివిల్ సె÷-లైస్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ జి వీరపాండియన్, గృహనిర్మాణశాఖ స్పెషల్ సెక్రటరీ బి మహమ్మద్ దీవాన్, విపత్తు నిర్వహణశాఖ డైరెక్టర్ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# దేశానికి అంబేద్కర్ చేసిన చిరస్మరణీయం : గంగుల



కరీంనగర్,డిసెంబర్6(సమ సమాజం): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లోని ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా.బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రాయడంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎంతో శ్రమించారన్నారు. రిజర్వు బ్యాంక్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి దేశ స్థిరమైన ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాదులు వేశారని గుర్తు చేశారు. అలాగే అనేక ఉద్యమాలు చేసి సామాజిక న్యాయం అలుపెరుగని పోరాటం చేశారు. ముఖ్యంగా మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సునిల్ రావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# ఎంపి పదవికి రేవంత్ రాజీనామా


## స్పీకర్ ఓంబిర్లాకు రాజీనామా లేఖ అందచేత

**బిజెపికి చెందిన మరో పదిమంది ఎంపిల రాజీనామా**

**వీరంతా ఆయా రాష్ట్రాల ఎమ్మెల్యేలుగా ఎన్నిక**

న్యూఢిల్లీ,డిసెంబర్6(సమ సమాజం): తెలంగాణ సీఎంగా ఎంపికైన సీఎల్పీ నేత, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పీకర్ ఓంబిర్లా ను కలిసి ఎంపీ పదవికి రాజీనామా చేశారు. స్పీకర్‌ని కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. నేడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఎంపీ పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేశారు. మంగళవారం కాంగ్రెస్ హై కమాండ్ సీఎం అభ్యర్థిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఏఐసీసీ అగ్రనేతలతో తన క్యాబినెట్ కూర్పుపై చర్చించినట్లు సమాచారం. అనంతరం కాంగ్రెస్ ముఖ్య నేతలను కలిసి తన ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించారు. సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే బీజేపీలో కీలక పరిమాణం చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 12 మంది బీజేపీ ఎంపీలలో గెలుపొందిన 10 మంది ఎంపీలు తమ పార్లమెంటు సభ్యత్వానికి బుధవారంనాడు రాజీనామా చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశం అనంతరం వీరు తమ రాజీనామాలు సమర్పించారు. పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసిన ఎంపీలలో మధ్యప్రదేశ్ నుంచి గెలిచిన నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, రాకేష్ సింగ్, ఉదయ్ ప్రతాప్, రీతీ పాథక్, ఛత్తీస్‌గఢ్ నుంచి అరుణ్ సవో, గోమతి సాయి, రాజస్థాన్ నుంచి రాజ్యవర్ధన్ రాథోడ్, కిరోడి లాల్ మీనా ఉన్నారు. తోమర్, పటేల్ కేంద్ర మంత్రివర్గానికి కూడా రాజీనామా చేశారు. కిరోడి లాల్ మీనా రాజ్యసభకు రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి రేణుకా సింగ్, మహంత్ బాలక్‌నాథ్ కూడా లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో ముఖ్యమంత్రుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఈ రాజీనామాల పర్వం చోటుచేసుకుంది.

# సహాయక చర్యలు తీసుకోవటంతో జగన్ ప్రభుత్వం విఫలం : దేవినేని ఉమామహేశ్వరరావు




అమరావతి,డిసెంబర్6(సమ సమాజం): మిచౌంగ్ తుఫాన్ సహాయక చర్యల్లో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్ర ప్రజల ఇబ్బందులు పట్టించుకునే నాధుడే లేడని తెలుగుదేశం నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. బుధవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ బాధితులకు వసతి, భోజనం ఏర్పాటు చేయలేని ప్రభుత్వం ఎందుకన్నారు. హుద్ హుద్ లాంటి మహాప్రళయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. హుద్ హుద్, తుపాను వల్ల బాధితులకు నాటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన పరిహారాన్ని జగన్ సర్కార్ తగ్గించడం దుర్మార్గమన్నారు. కష్టాలలో ఉన్న ప్రజలను పరామర్శించే తీరిక లేని సీఎం జగన్ తా దేపల్లిలో పబ్జి ఆడుకుంటున్నారని దేవినేని ఉమ ఎద్దేవా చేశారు. కాగా విజయవాడ ప్రకాశం బ్యారేజికు భారీగా వరద నీరు చేరింది. 12 అడుగుల గరిష్ఠ నీటి మట్టం దాటి నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు పది గేట్లు అడుగు మేర ఎత్తి 5,960 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజికు వరదనీరు చేరుతోంది.

# ఇంటి గోడ కూలి దంపతుల మృతి

**పొంగులేటి ఆదేశాలతో పరామర్శించి లక్ష పరిహారం అందచేత**



ఖమ్మం,డిసెంబర్6(సమ సమాజం): ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో దారుణం జరిగింది. రెండు రోజులుగా కురిసిన వర్షాలతో చెరువు మాదారంలో నూకతొట్టి పుల్లారావు, లక్ష్మీల ఇల్లు దెబ్బతిని మంగళవారం రాత్రి మట్టిగోడ కూలి మీద పడడంతో ఇంట్లో నిద్రిస్తున్న ఆ దంపతులిద్దరూ దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం వారి మృతదేహాలను సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మిచౌంగ్ తుపానుతో పడుతున్న వానలకు మట్టిల్లు దెబ్బతిని ఇలా జరిగిందని, నిరుపేదలు చనిపోయారని స్థానికులు వివరించారు. స్పందించిన దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ దుర్ఘటన బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అండగా ఉంటారని అభయమిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని అభయమిచ్చారు. దయాకర్ రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, సర్పంచ్ సుజాత ఎంపీటీసీ పుష్పలత, స్థానికులు కృష్ణారెడ్డి, రవి, చంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాము, మరికంటి రమేష్ తదితరులు ఉన్నారు.

# సుమారు వంద అక్రమ వెబ్‌సైట్లు



న్యూఢిల్లీ,డిసెంబర్ 6 (సమ సమాజం): సుమారు వందకుపైగా అక్రమ వెబ్‌సైట్లపై కేంద్ర హోంశాఖ చర్యలు తీసుకున్నది. ఆ వెబ్‌సైట్లు వ్యవస్థీకృత అక్రమ పెట్టుబడులు, పార్ట్‌టైం జాబ్ మోసాలకు పాల్పడుతున్న కేంద్ర హోంశాఖ తెలిపింది. విదేశీ వ్యక్తులు ఆ వెబ్‌సైట్లను ఆపరేట్ చేస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర హోంశాఖకు చెందిన నేషనల్ సైబర్‌క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్‌కు అనుబంధమైన ఇండియన్ సైబర్‌క్రైం కోఆర్డినేషన్ సెంటర్ ఆ అక్రమ వెబ్‌సైట్లను గుర్తంచింది. వారం క్రితం ఆ వెబ్‌సైట్లను బ్లాక్ చేశారు. ఎ4అ ఇచ్చిన సూచనల మేరకు కేంద్ర ఐటీశాఖ ఆ సైట్లను బ్లాక్ చేసింది. డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్లు, చాట్ మెసెంజర్లు, రెంట్ అకౌంట్ల ద్వారా ఆ వెబ్‌సైట్లకు నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక నేరాల ద్వారా వస్తున్న నిధుల్ని విదేశాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. క్రెడిట్ కార్డులు, క్రిప్టోకరెన్సీలు, ఓవర్‌సీస్ ఏటీఎం విత్‌డ్రాలు, ఇంటర్నేషనల్ ఫిన్‌టెక్ కంపెనీల ద్వారా ఆ సొమ్మును తరలిస్తున్నట్లు ప్రకటలో పేర్కొన్నారు.

# మంథనిలో శ్రీధర్‌బాబుదే హవా

## పుట్టా మధుకర్ తీరుతో ప్రజల్లో అసహనం

పెద్దపల్లి,డిసెంబ6(సమ సమాజం): మంథనిలో పరిస్థితి ఇప్పుడు మాజీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అనుకూలంగా మారింది. ఆయనపై కేసులు పెట్టి వేధించడం, అనవసరంగా కేసుల్లో ఇరికించడం వంటి చర్యల కారణంగా మంథనిలో బిఆర్ఎస్ పట్ల తీవ్ర వ్యతిరేకత వచ్చింది. గతంలో శ్రీధర్ బాబుకు అనుచరుడుగా ఉన్న పుట్టా మధుకర్ తరవాతి కాలంలో బిఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యే అయ్యారు. అయితే అది ఎంతోకాలం నిల్వలేదు. గత అసెంబ్లీ ఎన్నిరల్లోనూ..తాజా అసెబంలీ ఎన్నికల్లోనూ శ్రీధర్ బాబు మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు ఆయనను స్పీకర్ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. స్థానికంగా పుట్టా మధుకర్ తీరుతో ప్రజలు అనూహ్యంగా మళ్లీ శ్రీధర్‌బాబు మంచితనాన్ని గుర్తించి ఆయనకు అండగా నిలిచారు. కాంగ్రెస్ వైపు ప్రజలు మొగ్గు చూపారు. అయనకు పరిస్థితులు కూడా కలసి వచ్చాయి. మంథనిలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పుట్ట మధులు ముచ్చటగా మూడోసారి తలపడ్డారు.. 2009 ఎన్నికల్లో ప్రత్యర్థులుగా ఎన్నికల గోదాలోకి దిగిన శ్రీధర్‌బాబు, మధులు వరుసగా మూడోసారి పోటీకి సిద్ధమయ్యారు. గత రెండు ఎన్నికల్లో టిఆర్ఎస్ తరఫున మధు గెలుపొందారు. 2009లో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంగ్రెస్ నుంచి, పుట్ట మధు ప్రజారాజ్యం నుంచి పోటీపడగా, మధుపై శ్రీధర్‌బాబు విజయం సాధించారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో శ్రీధర్‌బాబు కాంగ్రెస్ నుంచే పోటీ చేయగా, మధు టీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో శ్రీధర్‌బాబుపై పుట్ట మధు గెలుపొందారు. ఆ తరవాత 2018, 2023లో మళ్లీ శ్రీధర్ బాబు గెలుపొందారు. సింగరేణి కార్మికులకు ఆయన వెన్నంటి నిలవడం ప్లస్ పాయింట్‌గా మారింది.

# తుఫానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి సూచన**



హైదరాబాద్,డిసెంబర్6(సమ సమాజం): మిగ్‌జాం తుపాను ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం జరగకుండా చూడాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ ప్రకటనలో అధికారులకు సూచించారు. లోతట్టు, ఏజెన్సీ ప్రాంతాల్లో జనజీవనం స్తంభించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పలు ప్రాంతాల్లో ధాన్యం రాశులు తడిసిపోయే అవకాశం ఉందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోందని, ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు దృష్టిపెట్టాలని, ఎక్కడికక్కడ రైతులకు అండగా నిలిచి అవసరమైన సహాయ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, యాదాద్రి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారా యణపేట, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. భారీ వర్ష సూచన ఉన్నందున ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారులను అప్రమత్తం చేయాలని, పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి ఆహారం, సురక్షిత నీరు అందేలా చూడాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, విద్యుత్, రహదారులు దెబ్బతినే పక్షంలో వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి కోరారు.

# అంబేడ్కర్‌కు జగన్ నివాళి

అమరావతి,డిసెంబర్6(సమ సమాజం): :రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు సిఎం జగన్ ఘనంగా నివాళి అర్పించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళు లర్పించారు. కార్యక్రమంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు(సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు పాల్గొని నివాళు లర్పించారు.

# కాంగ్రెస్ ఏడాది మాత్రమే అధికారంలో ఉంటుంది

### బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం): తెలంగాణలో బీజేపీకి 8 స్థానాలు ఇచ్చినందుకు ప్రజలకు గోషామహల్ ఎమ్మెల్యే కె. రాజాసింగ్ కృతజ్ఞతలు తెలిపారు. మోసం చేసిన కేసీఆర్‌ను ప్రజలు ఫాంహౌస్ కు పంపించేశారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని మార్చేస్తానన్న కేసీఆర్‌నే ప్రజలు మార్చారని గుర్తు చేశారు. బుధవారం రాజాసింగ్ మీడియాతో మాట్లాడారు. ఏడాది తర్వాత తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్న వేళ రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ రోజులు ప్రభుత్వాన్ని నడపలేదని అన్నారు. ఒక్క ఏడాదికి మించి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని, ఆ తర్వాత బీజేపీ ప్రభుత్వం వస్తుందని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అని అన్నారు. కేసీఆర్ సీఎంగా దిగిపోతూ రాష్ట్రానికి గుంతలు పెట్టి వెళ్లారని, వాటిని పూడ్చడానికే కాంగ్రెస్ కు సరిపోతుందని అన్నారు. పైగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటే మరిన్ని అప్పులు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇవన్నీ భరించలేక కాంగ్రెస్ పార్టీలో కల్లోలం రేగి దిగిపోతుందని అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తాము ఆయన విగ్రహానికి నివాళి అర్పించామని అన్నారు. ఇలాగే ప్రతి కార్యాలయంలోనూ నివాళి అర్పిస్తామని అన్నారు. మరి మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు అంబేద్కర్ కు ఒక్కసారి కూడా నివాళి అర్పించలేదని అన్నారు.

# ముఖ్యమంత్రిగా నేడు రేవంత్ రెడ్డి ప్రమాణం



ప్రతిష్టంభన కొనసాగుతూ వచ్చింది. గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌లో సమావేశమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా సీఎల్పీ ఎంపిక నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు అప్పగిస్తూ సోమవారం ఏక వాక్య తీర్మానం చేశారు. దీన్ని భట్టి విక్రమార్క, సీతక్కతోపాటు పలువురు ఎమ్మెల్యేలు బలపరిచారు. సీఎల్పీ తీర్మానాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధిష్ఠానానికి చేరవేశారు. దీనిపై మంగళవారం సుదీర్ఘంగా చర్చించిన అగ్రనేతలు రేవంత్‌ను సీఎంగా ఎంపిక చేశారు. మంత్రివర్గంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై చర్చించేందుకు రేవంత్‌ను కాంగ్రెస్ అధిష్టానం ఢిల్లీకి రావాలని సూచించింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగిన రేవంత్ రెడ్డి అనతికాలంలోనే సిఎం కాబోతున్నారు. తక్కువ కాలంలో రాజకీయంగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించబోతున్నారు.ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ సభాపక్ష నేత రేవంత్ రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. అయితే ప్రమాణ స్వీకారం సమయంలో స్వల్ప మార్పు జరిగింది. ఉదయం 10.28 నిమిషాలకు ప్రమాణం చేయాలని ముందుగా నిర్ణయించగా దానిని మధ్యాహ్నం 1.04 నిమిషాలకు మార్చారు. ఈ విషయాన్ని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కూడా ప్రత్యేకంగా కలిసి ఆహ్వానం పలికారు. మరోవైపు క్యాబినెట్ కూర్పుపై చర్చ జరగలేదని కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ లీ తెలిపారు. ఇదిలావుండగా రేవంత్ ప్రమాణస్వీకారానికి సంబంధించి ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాణస్వీకార కార్యక్రమ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలంటూ ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి.. రేవంత్ ఆహ్వానం పంపారు. ఆయనతోపాటు ఏఐసీసీ నేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎంలు, వివిధ రాజకీయ పార్టీల నేతలకు టీపీసీసీ ఆహ్వానాలు పంపింది. వీరిలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, ఏపీ సీఎం వైఎస్ జగన్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తదితరులు ఉన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రేవంతే స్వయంగా వెళ్లి ఆహ్వానించారు. వారితో పాటు కాంగ్రెస్ గెలుపులో కృషి చేసిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తదితర మంత్రులను ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆహ్వానించారు. వీరితోపాటు హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకూ టీపీసీసీ ఆహ్వానం పంపింది. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, కంచె ఐలయ్యతో పాటు వివిధ కుల సంఘాల నేతలు, సినీ ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయి.

# పివోకే ఎప్పటికే మనదే



చెందిందేనని ఆయన లోక్‌సభలో తేల్చి చెప్పారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కారణంగా జమ్మకశ్మీర్ రెండు తప్పుల్ని చవిచూసిందని పేర్కొన్నారు. ఒకవేళ నెహ్రూ సరైన చర్యలు తీసుకొని ఉండుంటే.. పీఓకే ఇప్పుడు భారత్‌లో భాగమై ఉండేదని, ఇదొక చారిత్రాత్మక తప్పిదని సభలో ఉద్ఘాటించారు. రెండు పొరపాట్ల కారణంగా జమ్మూకశ్మీర్ తీవ్రంగా నష్టపోయింది. మొదటిది.. పాక్‌తో యుద్ధంలో మన సైన్యం గెలుస్తున్నప్పుడు 'కాల్పుల విరమణ' విధించడం. ఒకవేళ మరో మూడు రోజుల పాటు ఆ యుద్ధాన్ని కొనసాగించి, ఆ తర్వాత సీజ్ ఫైర్‌కి పిలుపునిచ్చి ఉంటే.. పీఓకే మన దేశంలో భాగమై ఉండేది. ఇక రెండోది.. మన అంతర్గత సమస్యను ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకెళ్లడం అని అమిత్ షా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద సంఘటనలు చోటు చేసుకోకుండా చేయాలని భారత ప్రభుత్వం యోచిస్తోందని, 2026 నాటికల్లా ఆ విషయంలో విజయం సాధిస్తామని చెప్పారు. ఇదే సమయంలో.. జమ్మూకశ్మీర్ రిజర్వేషన్ (సవరణ), జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లులను లోక్‌సభలో ఆమోదం కోసం పంపబడ్డాయని అమిత్ షా స్పష్టం చేశారు. జమ్ము కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు–2023, జమ్ము కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2023పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగించారు. అన్యాయం జరిగిన వారికి న్యాయం చేకూర్చడానికి మాత్రమే ఈ బిల్లులను తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. అణగారిని వారిని పైకి తీసుకురావడమే రాజ్యాంగ మూల సూత్రమని పేర్కొన్నారు.దేశంలో 1980 దశకంలో ఉగ్రవాదం తీవ్రంగా పెరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. దేశంలో ఓ భాగాన్ని ఆక్రమించుకుని అక్కడి ప్రజలను నిరాశ్రయుల్ని చేశారని మండిపడ్డారు. కశ్మీరీ పండిట్‌లు తమ సొంత దేశంలో శరణార్థులుగా బతికాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం 46,631 కుటుంబాలు, 1,57,968 మంది తమ సొంత స్థలాలను వదిలి వచ్చారని తెలిపారు. ప్రస్తుత బిల్లులతో వారందరికి హక్కులు కల్పించబడతాయని చెప్పారు. కశ్మీర్‌పై పాకిస్థాన్ 1947లో దాడి చేసింది. ఆ సమయంలో దాదాపు 31,789 కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. 1965, 1971 యుద్ధాల సమయంలో 10,065 కుటుంబాలు వలసబాట పట్టాయి. 1947, 1969, 1971 యుద్ధాల్లో మొత్తం 41,844 కుటుంబాలు శరణార్థులుగా తరలివచ్చాయి. ఈ బిల్లు ఆ ప్రజలకు హక్కులు కల్పించడానికి వచ్చిందే' అని అమిత్ షా అన్నారు.

# తొలి హామీని నిలబెట్టుకుంటున్న రేవంత్



పోయింది. రేపు డిసెంబర్ 7న ఎల్బీ స్టేడియంలో రేవంత్ ప్రమాణం ముఖ్యమంత్రిగా చేయనున్నారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీ హామీలు నెరవేర్చడంపైనా ఆయన స్పష్టమైన ఒక ప్రకటన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే.. తొలి ఉద్యోగం కూడా ఎవరికి ఇవ్వాలనే దానిపై ఓ క్లారిటీతో ఉన్నారు.తెలంగాణ కాంగ్రెస్ పాలనలో తొలి ఉద్యోగం రజినీ అనే యువతికి దక్కనుంది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేయాలని అధికార యంత్రాంగాన్ని రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. తొలి ఉద్యోగం రజినీకి ఇస్తాం అని స్వయంగా ప్రకటన చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడా గ్యారెంటీని నెరవేర్చేందుకు రెడీ అయిపోయారు. అక్టోబర్ 17వ తేదీన.. నాంపల్లికి చెందిన రజిని అనే ఓ దివ్యాంగురాలు గాంధీభవన్‌కు వెళ్లి రేవంత్‌రెడ్డిని కలిశారు. రజిని రెండేళ్ల క్రితం పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం వెతుకుతోంది. పీజీ చేసిన తనకు ఇటు ప్రభుత్వంలోనూ అటు ప్రైవేటులోనూ ఉద్యోగం రావట్లేదని తన బాధను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి చెప్పింది. అప్పుడు రేవంత్ రెడ్డి .. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మొదటి ఉద్యోగం నీకే ఇస్తాం. డిసెంబర్ 9న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సీఎం ప్రమాణ స్వీకార సభ ఉంటుంది. ఆ సభకు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ వస్తారు. ఆ సభలోనే మొదటి ఉద్యోగం నీకేనమ్మా. ఇది నా గ్యారెంటీ' అంటూ రేవంత్ ఆమెకు హామీ ఇచ్చారు. అంతేకాదు.. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు మీద స్వయంగా ఆయన రజినీ పేరు రాసి.. కింద సంతకం కూడా చేశారు. నెలన్నర తర్వాత.. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో తొలి ఉద్యోగం రజినికే దక్కబోతోంది. కానీ, ప్రమాణ స్వీకారమే రెండు రోజులు ముందుగానే జరుగుతోంది.

### భారత సంస్కృతిని కాంగ్రెస్ అవమానిస్తుంది

# అనురాగ్ థాకూర్




గాంధీ మౌనంగా ఉన్నారని మంత్రి ఆరోపించారు. వసుదైక కుటుంబం అన్న సందేశాన్ని ప్రధాని మోదీ వ్యాపింపచేస్తున్నారని, కానీ విపక్షాలు మాత్రం తప్పుడు భాషను వాడుతోందని, మూడు రాష్ట్రాల్లో ఓటమికి ఈవీఎంలను నిందిస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదన్నారు. ఓటమి తర్వాత ఆ పార్టీ కారణాలను అన్వేషించలేకపోతున్నదని, వాళ్లు ఈవీఎంలను నిందిస్తున్నారని, సనాతన ధర్మాన్ని, హిందువులను, హిందూ సంస్కృతిని ప్రశ్నిస్తున్నారని కేంద్ర మంత్రి థాకూర్ తెలిపారు.

# అసెంబ్లీలో గెలిపిన ఎంపిలు లోక్‌సభకు రాజీనామాలు



ఎన్నికల్లో గెలిచిన 12 మంది బీజేపీ ఎంపీల్లో 10 మంది బుధవారం ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారని, ఆ తర్వాత లోక్‌సభకు రాజీనామాలు సమర్పించారని బీజేపీ వర్గాలు తెలిపాయి. జేపీ నడ్డా వారిని స్పీకర్ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు వెల్లడించాయి. కాగా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి రాజీనామా సమర్పించిన వారిలో కేంద్ర మంత్రులు నరేంద్ర తోమర్, ప్రహ్లాద్ పటేల్, ఎంపీలు రితీ పాఠక్, రాకేష్ సింగ్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో గెలిచిన ఉదయ్ ప్రతాప్ సింగ్ ఉన్నారు. అలాగే రాజస్థాన్‌లో పోటీ చేసి విజయం సాధించిన కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్, దియా కుమార్, ఛత్తీస్‌గఢ్ నుంచి గెలిచిన అరుణ్ సావో అన్స్ గోమతి సాయి తమ రాజీనామాలు సమర్పించారు. మరోవైపు రాజ్యసభ ఎంపీగా ఉన్న కిరోరి లాల్ మీనా కూడా రాజ్యసభ ఛైర్మన్‌కు రాజీనామా సమర్పించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఎంపీలు బాబా బాలక్‌నాథ్, రేణుకా సింగ్ ఇంకా రాజీనామాలు సమర్పించలేదు. వారు కూడా రాజీనామాలు చేస్తారని సమాచారం.

# కాంగ్రెస్‌లో మంత్రి పదవుల కోసం పోటీ

### తొలిదశలో ఆరుగురికే చాన్స్ ఉండొచ్చని సమాచారం

### సిఎం ర ఏవంత్‌తో సహా ఏడుగురు ప్రమాణం చేసే అవకాశం

హైదరాబాద్,డిసెంబర్6(సమ సమాజం):తెలంగాణ మంత్రివర్గంలో 18 మంది వరకు చోటు దక్కనుంది. అయితే మంత్రివర్గంలో స్థానం కోసం 30 మందికిపైగా నేతలు పోటీ పడుతున్నారు. ఎప్పటి నుంచో కాంగ్రెస్‌లో ఉంటూ రాజకీయాలు చేస్తున్న వారే ఎక్కువ. వారిలో ఎవరెవరికి స్థానం లభిస్తోందో అన్న లెక్కలు వేసుకుంటున్నారు. అయితే తొలిదశలో కేవలం ఆరుగురికే ఛాన్స్ దక్కనుందని తెలుస్తోంది. కులాల వారిగీ తొలిదశలో సిఎం రేవంత్‌తో కలసి మరో ఆరుగురు ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, సీతక్క,షబ్బీర్ అలీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఖాయమని అంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్‌లో పోటీ విపరీతంగా ఉంది. నల్గొండ నుంచి కోమటి రెడ్డి బ్రదర్స్‌తోపాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి రేసులో ఉన్నారు. ఖమ్మం జిల్లా నుంచి కూడా మల్లు భట్టి విక్రమార్కతోపాటు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వర్గం కూడా మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇలా దామోదర్ రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, షబ్బీర్ అలీ,ఉండనున్నారు. సుమారు 30 మందికిపైగా నేతలు మంత్రులు కావాలనే టార్గెట్ పెట్టుకున్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి పేరు ఖరారు చేసిన తర్వాత ఆయన్ని ఢిల్లీకి పిలిపించుకున్న కాంగ్రెస్ అధినాయకత్వం ఈ జట్టుపైనే కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రేవంత్ నాయకత్వాన్ని అంగీకరించని వారిని సంతృప్తి పరచాల్సి ఉంటుంది. వారికి ఎలాంటి శాఖలు ఇస్తారనే ఉత్కంఠ నెలకొంది. ఉత్తమ్ లాంట వాళ్లు తాము కూడా సీఎం రేస్‌లో ఉన్నామని బహిరంగంగానే చెప్పేశారు. మరి వాళ్ల ఇచ్చే పదవులు ఎలా ఉంటాయో చూడాలి. ఓడిపోయిన నేతలు కూడా కొందరు మంత్రులు కావాలని తహతహలాడుతున్నారు. జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి లాంటి వాళ్లు ఓడిపోయినప్పటికీ మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ పటిష్టానికి శ్రమించారు. వాళ్లను కూడా సర్దుబాటు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ అధినాయకత్వానికి ఉంటుంది. వారిని ఎలా సంతృప్తి పరుస్తారో చూడాలి. ఎన్నికల సందర్భంగా కొందరు నేతలకు కూడా మంత్రి పదవిపై కాంగ్రెస్ అధినాయకత్వం హామీ ఇచ్చింది. వారిని కూడా ఈసారి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. వారి విషయంలో ఎలా ముందుకెళ్తారనే ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. డిప్యూటీ సీఎంలు ఎన్ని ఉండాలనే చర్చ కూడా సాగుతోంది. మల్లుభట్టివిక్రమార్క లాంటి వాళ్లు ఒకటే ఉండాలని పట్టుబడుతున్నారు వీటన్నింటిపై ఢిల్లీలో మంతనాలు జరుపుతున్న రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి 10 గంటలకు డీకే శివకుమార్, మాణిక్కం ఠాగూర్‌తో భేటీ అయ్యారు. ఇవాళ మరికొందరితో సమావేశం అయ్యారు. తనకు సీఎం పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞత చెబుతూనే జట్టులో ఎవరెవరు ఉండాలి అనే అంశంపై చర్చిస్తారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో సమావేశం కానున్నారు. గురువారం జరగబోయే ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో పాటు, పలు రాష్ట్రాలకు నాయకులకు కూడా రేవంత్ ఆహ్వానం పంపించనున్నారు. గురువారం ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 9వ తేదీన సోనియాకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేయబోతున్నట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ సభ ఉంటుందని మాత్రం కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

### గాంధీభవన్ ద్వారా పలువురికి ఆహ్వానాలు



హైదరాబాద్,డిసెంబర్6(సమ సమాజం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఆహ్వానపత్రాలను గాంధీభవన్ సిద్ధం చేసింది. అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ ముఖ్య నేతలకు గాంధీభవన్ ఆహ్వానాలు పంపింది. రాష్ట్రంలోని అన్ని పార్టీల అధ్యక్షులకు, కొత్తగా ఎన్నికైన 119 మంది ఎమ్మెల్యేలకు సైతం ఇన్విటేషన్లు ఇవ్వనున్నారు. మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలకు సైతం ఆహ్వానాలు పంపనున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని జిల్లాల డీసీసీ అధ్యక్షులకు సైతం ఆహ్వానాలు అందించింది.

# ఎల్బీ స్టేడియంలో సిఎం ప్రమాణ స్వీకారోత్సవం



ఎల్.బి. స్టేడియంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజి లు సీ.వి.ఆనంద్, శివధర్ రెడ్డి, నగరపోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యా, ముఖ్య కార్యదర్శులు శైలజా రామయ్యర్, రిజ్వి, జలమండలి ఎం.డి దాన కిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, సమాచార శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, రాజ్ భవన్ కార్యదర్శి సురేంద్రమోహన్ , వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మల్లు రవి, వెం నరేందర్ రెడ్డి,అంజన్ కుమార్ యాదవ్, శ్రీమతి మున్నీ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ఇతర ప్రముఖులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని అన్నారు, స్టేడియంలో మంచినీటితోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొంటున్నారని, వారికి ప్రత్యేకంగా గ్యాలరీలతోపాటు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. వాహనాల పార్కింగ్, బందోబస్త్ లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు.

## తెలంగాణలో టిడిపి ఇక అంతర్ధానమే

**నేతలు జారుకోవడంతో పార్టీ ఖాళీ**

**పార్టీ బలోపేతంపై ఆశలు వదులుకున్న బాబు**

హైదరాబాద్,డిసెంబర్6(సమ సమాజం): తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ప్రభ ఇప్పుడు పూర్తిగా మసకబారినట్లే. అందులో ఉన్న నాయకులు ఎవరు కూడా పెద్దగా ప్రభావితం చేసే స్థాయిలో లేరు. ందుకు తసీఉకుని వెళ్లే ఆలోచనలో కూడా బాబు ఉన్నట్లు లేదు. ఇకపోతే కొన ఊపిరితో ఉన్న ఆ పార్టీని దెబ్బ కొట్టాలనుకుంటున్న సిఎం కెసిఆర్‌కు పనిలేకుండా రేవంత్ కాగల కార్యం గంధర్వులు చేసె అన్న చందంగా చేసి పెట్టారు. తెలంగాణలో టిడిపి ఎంతో కొంత బలపడాలన్నది ఇక కాని పని. ఎందుకంటే టిడిపిలో ఉన్న వారంతా కొందరు బిఆర్‌ఎస్‌లో చేరగా మిగిలిన వారంతా కాంగ్రెస్‌లో చేరారు. ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపు మళ్లారని ఇటీవలి ఎన్నికల ఫలితాల్లో తేలింది. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి అంతో ఎంతో కొంత ఓటు బ్యాంకు ఉంది. అయితే అది ఎవరికి వెళుతుందన్న దనిపై చర్చలు సాగాయి. గతంలో అది బిఆర్‌ఎస్‌కు బదిలీ అయ్యింది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు,ఎంపిలు బిఆర్‌ఎస్‌లో చేరడం వల్ల చాలామంది అటువైపుగా వెళ్లారు. కెసిఆర్ పిలుపుతో అనేకులు పార్టీ మారారు. పరిస్థితి మారడంతో చాలామంది కొందరు రేవంత్ రెడ్డితో కాంగ్రెస్‌లోకి వెళ్లారు. వీరంతా ఓటుబ్యాంకుగా మారారని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఎన్టీఆర్‌పై అభిమానంతో కాకున్నా..ఓట్ల కోసం కెసిఆర్ ఆయన పథకాలను కొన్నింటిని పదేపదే స్మరించినా లాభం లేకుండా పోయింది. చివరకు టిడిపి తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీలో చేర్చుకున్నారు. రాజకీయాలలో అలాంటి సెంటిమెంట్లకు తావు ఉండదు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని నిలబెట్టడానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. ఎందుకంటే తెలంగాణలో పార్టీ గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ఏపీలో తన రాజకీయ భవిష్యత్తుతో పాటు, తన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుంది. అంతేకాకుండా చంద్రబాబును ఆంధ్రా ప్రాంత నాయకుడిగా మాత్రమే తెలంగాణ ప్రజలు చూస్తున్నందున ఆయన స్వయంగా వచ్చి కూర్చున్నా పార్టీని బతికించడం కష్టం. ఈ పరిస్థితులలో తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులు మాత్రమే పార్టీని గట్టెక్కించుకోవడం కోసం ప్రయత్నించడం లేదా, రేవంత్‌లా దారి చూసుకోవడం తప్పదని గుర్తించారు.రేవంత్ కూడా వ్యూహాత్మ కంగా వారందనినీ కాంగ్రెస్‌లో చేర్చుకున్న తుమ్మల, మండవ లాంటి వారిని చివరి నిముషంలో పార్టీకి రప్పించారు. తెలంగాణకు చెందిన తెలుగుదేశం నాయకులు అధికారానికి దూరమై 14 ఏళ్లు అవుతోంది. కమ్యూనిస్టుల తరహాలో అధికారంపై ఆశ లేకుండా, పార్టీని అంటిపెట్టుకుని ఉండే పరిస్థితి సంప్రదాయ రాజకీయపార్టీల నాయకులకు ఉండదు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ మనుగడ సాగించినా, సాగించకపోయినా చంద్రబాబుకు కూడా వచ్చే నష్టం లేదు.

## నిజాం షుగర్స్ బాధ్యత మాదే

**రైతులకు అండగా చర్యలు ఉంటాయి**

**మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి హామీ**

నిజామాబాద్,డిసెంబర్6(సమ సమాజం): బిఆర్‌ఎస్, బీజేపీ పార్టీ లాగా తమ కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇవ్వదని మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను మభ్యపెట్టి, లేనిపోని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ప్రజాధానాన్ని దుర్వినియోగం చేసిన బిఆర్‌ఎస్ నాయకులకు ఈ ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో 100రోజులో నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని చెప్పి ఇచ్చిన హామీని కెసిఆర్ తుంగలో తొక్కిందన్నారు. ఫ్యాక్టరీ విషయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లామని, పార్టీ అధికారంలోకి వస్తే తప్పనిసరిగా ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నారు. దీనిపై ఇప్పుడు మళ్లీ తము దృష్టి సారిస్తామని ఆయన అన్నారు. అలాగే చెరకు రైతులకు అండగా ఉంటామని అన్నారు. అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీని నిలబెట్టుకుంటామని అన్నారు. అన్ని పంటలకు బీమా సౌకర్యం కల్పించి బీమా సొమ్మును కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. పేదల సొతింటి కలను సహకారం చేసేందుకు కొత్తగా ఇళ్లు కట్టుకునే వారికి రూ.5లక్షలు ఆర్థికసా యం అందిస్తామన్నారు.

## తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి : పురంధర్వేశ్వరి

అమరావతి,డిసెంబర్6(సమ సమాజం): పంట నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, ఉద్యానవన పంటల సాగుదారులకు వెంటనే ఆర్థిక సహకారం మంజూరు చేయాలని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు.



బుధవారం ఆమె అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో సాగు చేసిన రైతాంగాన్ని కూడా ఆదుకోవాలని కోరారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆహారాధాన్యాలతో పాటు ఉద్యానవన పంటలతో సహా పలు వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అయితే భీమా చేసిన రైతాంగం ఎంతమంది.. లేనివారు ఎంతమంది అనే గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ డొమైన్‌లో పెట్టక పోవడం వల్ల రైతాంగం ఆందోళన చెందే పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయన్నారు. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వం వెంటనే ఒక ప్రకటన చేయాలని దగ్గుబాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు.

## ఎపి జలవనరులపై కేంద్రం మండిపాటు

అమరావతి,డిసెంబర్6(సమ సమాజం): పోలవరం ప్రాజెక్టుపై మీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికైనా నిజాలు చెబుతున్నారా..? తెలంగాణలో కాళేశ్వరంను ఎలా చేశారో... ఆంధ్రాలో పోలవరాన్ని అలానే చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులపై కేంద్రం మండిపడింది. పోలవరంపై జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో రాష్ట్ర అధికారులపై కేంద్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు మండిపడ్డారు. ఈ విధంగా వ్యవహరిస్తే పోలవరం ఈ దశాబ్దంలో పూర్తి కాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత మూడేళ్లుగా కాఫర్ డామ్ సీపేజ్ గురించి చెబుతున్నా ఎందుకు పట్టించుకోలేదని కేంద్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపర్ డామ్ కుంగిపోతే కొత్తది నిర్మించేందుకు కనీసం అయిదేళ్ళు పడుతుందని తెలుసా? అని రాష్ట్ర అధికారులను ప్రశ్నించారు. సీపేజ్ ఒకవైపు వుంటే మరో వైపు నీరు ఎందుకు నిల్వ చేస్తున్నారని నిలదీశారు. కాపర్ డామ్ మరమ్మత్తులకు... పంపింగ్‌కు నిధులు ఇవ్వదని కేంద్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. పదిరోజుల్లో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీతో ఎంవోయూ చేసుకోవాలని రాష్ట్ర అధికారులకు ఆదేశించారు. తాము ప్రాజెక్ట్ అథారిటీ లోపాలపై రాసిన లేఖలకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని కేంద్రం నిలదీసింది.

## రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారంలో మార్పులు

హైదరాబాద్,డిసెంబర్6(సమ సమాజం): రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకార సమయంలో మార్పులు చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం గురువారం ఉదయం 10.28 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఆయన రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఆ సమయంలో మార్పులు చేశారు. గురువారం మధ్యాహ్నం 1.04 గంటలకు ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. అయితే ప్రమాణస్వీకార వేదికలో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ఎల్బీ స్టేడియంలోనే ఆయన ప్రమాణస్వీకారం కార్యక్రమం జరుగనుంది. నూతన సీఎం ప్రమాణస్వీకారం నేపథ్యంలో ఎల్బీస్టేడియంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి, డీజేపీ, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ఎల్బీ స్టేడియానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఇదిలావుంటే కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంకాగాంధీ తదితర అగ్ర నేతలందరినీ విడివిడిగా కలిసి తన ప్రమాణస్వీకర కార్యక్రమానికి ఆహ్వానించారు. అదేవిధంగా రాష్ట్రంలో మంత్రివర్గ కూర్పుపై కూడా వారితో చర్చించారు.



## బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు నిరుపమానం

**నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు**



మంథని,డిసెంబర్6(సమ సమాజం): భారత రాజ్యాంగ నిర్మాత, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖా మంత్రిగా ఇలా అంబేద్కర్ గురించి ఎంత చెప్పుకునా తక్కువేననడంలో అతిశయోక్తి లేదని,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన ఎంతగానో శ్రమించారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్ అన్నారు. బుధవారం మంథని అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్,జిల్లా ఉపాధ్యక్షులు నూకల బాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావు, జిల్లా కార్యదర్శి కుదుదుల వెంకన్న, బిసి సెల్ అధ్యక్షులు గోటికారి కిషన్ జీ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,డివిజన్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ ఎరుకల రమేష్ బాబు,టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలు శివ, డివిజన్ ఎస్సి సెల్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్,తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజు, పట్టణ బిసి సెల్ అధ్యక్షులు బండారి ప్రసాద్,ఎంపిటిసి పెండ్లి ప్రభాకర్ రెడ్డి, మంథని మున్సిపల్ కౌన్సిలర్స్ పెండ్రి రమ రెడ్డి,చొప్పకట్ల హనుమంతు, సర్పంచ్లు జాగిరి సదానందం,తమ్మిశెట్టి రమేష్, పర్శవేనా మోహన్ యాదవ్, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ రేపాక శ్రీకాంత్, మాజీ సర్పంచ్ చంద్రు రాయమల్లు, నాయకుడు పేరావేనా లింగయ్య యాదవ్,సీనియర్ నాయకులు లైశెట్టి రాజు,పర్శ శ్రీనివాస్,మంథని లింగయ్య,జనగామ సదవలి, రొడ్డ రాజేశ్వర్ రావు,అక్కపాక సదయ్య, పోగుల సాగర్,మోహన్,మంథని శ్రీను,రాజమల్లు,అయేషా, ఐశాన్,సల్మాన్, ఫాహెం, శ్రీకాంత్, రేపాక లక్ష్మణ్ నాయకులు పాల్గొన్నారు

## సారీ..సర్ క్షమించండి

**గోమూత్ర వ్యాఖ్యలపై డిఎంకె ఎంపి**



న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం): ఉత్తరాది రాష్ట్రాలను 'గోమూత్ర' రాష్ట్రాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ పార్లమెంటుకు బుధవారంనాడు క్షమాపణ చెప్పారు. తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. రికార్డుల నుంచి తన వ్యాఖ్యలను తొలగించాల్సిందిగా సభాపతిని కోరారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన రెండు బిల్లులపై లోక్‌సభలో మంగళవారంనాడు జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ గెలిచిన రాష్ట్రాలు హిందీ బెల్ట్‌లో ఉన్నవేనని, వీటిని సహజంగా గోమూత్ర రాష్ట్రాలుగా పిలుస్తామని అన్నారు. బీజేపీ దక్షిణాదికి రాలేదని, అక్కడ ఎలాగూ అడుగు మోపలేరు కాబట్టి ఆయా రాష్ట్రాలను కేంద్ర పాలిత రాష్ట్రాలు చేస్తారనడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదన్నారు. లోక్‌సభలో ఆయన చేసిన వ్యాఖ్యలపై అటు బీజేపీ సభ్యులు మండిపడగా, డీఎంకే భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్ సైతం క్షమాపణ చెప్పాలని ఆయనకు సూచించింది. ఈ నేపథ్యంలో సెంథిల్ కుమార్ లోక్‌సభలో క్షమాపణలు తెలిపారు. నిన్న సభలో చేసిన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావు. అయితే తన వ్యాఖ్యలు కొందరు వ్యక్తులు, వర్గాల ప్రజల మనోభావాలను గాయపరిచి ఉంటే వాటిని ఉపసంహరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాను. నేను చేసిన వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నారు. నా వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నాను' సెంథిల్ కుమార్ లోక్‌సభకు తెలిపారు. లోక్‌సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన సెంథిల్ కుమార్‌ను డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మందలించినట్టు ఆ పార్టీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బహిరంగ వ్యాఖ్యలు చేసేటప్పుడు హుందాగా వ్యవహారించాల్సిన అవసరాన్ని పార్టీ పదేపదే చెబుతుంటుందని తెలిపింది. 'ఇండియా' బ్లాక్ కూటమిలో ఉన్న పలువురు నేతలు కూడా డీఎంకే ఎంపీ వ్యాఖ్యలను ఖండించాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇష్టానికి అనుగుణంగా ఓటు వేస్తారని, వారిని తక్కువ చేసి మాట్లాడటం సరికాదని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు. సెంథిల్ కుమార్ తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి, వాటిని ఉపసంహరించుకోవాలి కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు కార్తీ చిదంబరంలో మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

## కెసిఆర్ సింహంలా మళ్లీ వస్తారు

**కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు**



జనగామ,డిసెంబర్6(సమ సమాజం): తాజా ఫలితాలతో కుంగిపోవాల్సిన పనిలేదని, కెసిఆర్ సింహంలా విజృంభిస్తారని మాజీమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మనం తలచుకుంటే ఈ సర్కార్ ఎంత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గందరగోళంలో ఉన్నారని, బీఆర్‌ఎస్ సర్కార్ రావడం పెద్ద ఇబ్బంది కాదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం నాడు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ సింహంలా బయటకు వస్తారు. సమయం చెప్పలేము. బీఆర్‌ఎస్ పార్టీకి 39 సీట్లు వచ్చాయి, మా మిత్రులు ఎంఐఎం పార్టీకి 8 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకంగా ఉన్న బీజేపీ పార్టీ సీట్లను, కొందరు అసంతృప్తులను కూడా కలిపితే 56 సీట్లవుతాయి. సింహం రెండడుగులు వెనక్కి వేస్తోందంటే... వేటకు సిద్ధమైనట్టే. కేసీఆర్ అనే సింహం త్వరలోనే బయటకు వస్తుంది. ఎవరూ అధైర్యపడొద్దు' అని కడియం శ్రీహరి ఈ వ్యాఖ్యలు చేశారు.

## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు**



విజయవా, డిసెంబర్ 6 (సమ సమాజం): అధికారులూ క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. బుధవారం నాడు జిల్లాలో పంట నష్టం, సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ... పంట నష్టం వాటిల్లకుండా సలహాలు సూచనలు అందించాలి. ప్రభుత్వం పరంగా పూర్తి భరోసా ఉంటుందనే విషయాన్ని వివరించాలి. అంటు రోగాలు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య చర్యలనూ ముమ్మరం చేయాలి. జిల్లాలో ఖరీఫ్‌లో 41,163 హెక్టార్లలో వరి సాగు చేయగా ఇప్పటికే 10 వేలకు పైగా హెక్టార్లలో కోతలు జరిగాయని చెప్పారు. 28,979 హెక్టార్లలో పత్తి, 20,085 హెక్టార్లలో మిరప వేశారన్నారు. పంట పొలాల నుంచి వరద నీటిని తక్షణం బయటకు పంపేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు.

## పశ్చిమలో 15వేల ఎకరాల్లో పంటనష్టం: మంత్రి

భీమవరం,డిసెంబర్6(సమ సమాజం): పశ్చిమలో మిచౌనీగ్ తుఫాన్ కారణంగా15000 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం నాడు నర్సాపురం తీరంలో నష్టపోయిన పంట పొలాలను మంత్రి కారుమూరు, చీఫ్ విప్ ముదునూరి, ఆర్డీవో అంబరీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరు మాట్లాడుతూ... రైతులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుంది. తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం. రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. త్వరలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నష్టపరిహారంపై సాయం ప్రకటిస్తారని మంత్రి కారుమూరు నాగేశ్వరరావు తెలిపారు.

## నీటమునిగిన పంటలను పరిశీలించిన జనసేన,టిడిపి

కాకినాడ,డిసెంబర్6(సమ సమాజం): అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో నీట మునిగిన వరి పంటలను టీడీపీ - జనసేన బృందం పరిశీలించింది. పెదపూడి మండలం సంపర - కాండ్రేగుల గ్రామాల పరిధి ఆయకట్టులో మిచౌంగ్ తుఫాన్ వల్ల వర్షాలకు తడిసి పాడైన పంటలను మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి పరిశీలించారు. రోజుల తరబడి నీరు ఉండడంతో పలుచోట్ల వరి పంట కుళ్లిందని చెప్పారు. అన్నదాతలను ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పంట పరిశీలనకు రాకపోవడంపై ప్రశ్నించారు. తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొని నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## వైసిపి పాలనలో దళితులపై దాడులు

**టిడిపి నేత ఎంఎస్ రాజు వెల్లడి**

అమరావతి,డిసెంబర్6(సమ సమాజం): వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో దళితులపై 6 వేలకు పైగా దాడులు జరిగాయని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఎం.ఎస్ రాజు తెలిపారు. బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 150 మందికి పైగా దళితులు హత్యకు గురయ్యారు. దళిత దీనజనోద్ధారకుడిలా ఊదరగొట్టే జగన్ పాలనలో వారానికి 4 గురు హత్యలకు, 6 గురు హత్యాయత్నాలకు, రోజుకు ఇద్దరు దాడులకు, వారానికి ముగ్గురు దళిత మహిళలు అత్యాచారాలకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడుల్లో ఏపీ దక్షిణాది రాష్ట్రాల్లోనే అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. నేరాల్లో దేశంలో ఏపీ 7వ స్థానంలో ఉంది. దళితులపై దాడులకు సంబంధించి కేంద్ర నేరగణాంక సంస్థ తెలిపిన వివరాలపై, టీడీపీ చెబుతున్న లెక్కలపై సాక్షికి అనుమానం ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. దళిత-గిరిజనులపై వైసీపీకు, సాక్షి యాజమాన్యానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దీనిపై స్పందించాలని ఎం.ఎస్ రాజు డిమాండ్ చేశారు.

## చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ

**తాజా రాజకీయాలు పొత్తులపై చర్చలు**

**భేటీలో పాల్గొన్న నాదెండ్ల, లోకేశ్**



హైదరాబాద్,డిసెంబర్6(సమ సమాజం): జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ చంద్రబాబుతో మరోసారి భేటీ అయ్యారు. హైదరాబాద్ లోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. పవన్‌తో పాటు నాదెండ్ల మనోహర్ ఉన్నారు. వర్షాల కారణంగా పాదయాత్రకు విరామం ఇచ్చి హైదరాబాద్ వచ్చిన నారా లోకేష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే మార్చిలోనే సాధారణ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో .. కూటమిగా చేయాల్సిన పనులు, సీట్ల సర్దుబాటు, ఇతర ఎన్నికల వ్యూహాలపై వీరు మాట్లాడుకున్నట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు జైలు నుంచి విడుదలైన తర్వాత పవన్ కల్యాణ్ మొదటి సారి చంద్రబాబుతో సమావేశం అయ్యారు. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇచ్చినప్పుడు పవన్ కల్యాణ్ వరుణ్ తేజ్ వివాహ వేడుకల కోసం ఇటలీలో ఉన్నారు. వచ్చిన తర్వాత సమావేశం అవుతారని అనుకున్నారు కానీ మధ్యంతర బెయిల్ షరతుల కారణంగా విమర్శలు వస్తాయని ఆగిపోయారు. తర్వాత చంద్రబాబు వైద్య చికిత్స కోసం సమయం కేటాయించడంతో పవన్ కల్యాణ్ సమావేశం కాలేకపోయారు. ఈ మధ్యలో టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశాలు కూడా జరిగాయి. ఇప్పుడు రెగ్యులర్ బెయిల్ రావడంతో చంద్రబాబు ఆలయాల సందర్శనలో ఉన్నారు. వర్షాల కారణంగా శ్రీశైలం పర్యటన వాయిదా పడటంతో హఠాత్తుగా పవన్ కల్యాణ్, నాదెండ్లతో సమావేశం ఖరారయింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుని ఉంటారని భావిస్తున్నారు. సమావేశంలో లోకేష్ కూడా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. లోకేష్ పాదయాత్ర ముగింపు సభలో పవన్ కల్యాణ్ కూడా పాల్గొనాలని ఇప్పటికే నిర్ణయించారు. వచ్చే మూడు నెలల కాలంలో పూర్తి స్థాయిలో టీడీపీ, జనసేన ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. కలిసి ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా.. ఉమ్మడి మేనిఫెస్టోన గ్యారంటీ పేరుతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటికే సీట్ల సర్దుబాటు పైనా రెండు పార్టీల మధ్య అంతర్గత చర్చలు ప్రారంభమైనట్లుగా చెబుతున్నారు. బలం ఉన్న స్థానాల్లోనే పోటీ చేస్తామని పవన్ కల్యాణ్ చాలా కాలంగా చెబుతున్నారు. అదే సమయంలో బీజేపీని కలుపుకుని వెళ్లే విషయం పైనా చర్చలు జరుగుతున్నాయని భావిస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి సర్కార్ కు బీజేపీ ఇలా సహకరిస్తున్నంత కాలం.. ఆ పార్టీతో కలిసి పనిచేయడం సాధ్యం కాదన్న వాదన టీడీపీలో ఉంది.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA, Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU*,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in